"వద్దు" అని చెప్పడం చాలా కష్టం!

అందునా జగ్గరాజుకు ఆ మాట చెప్పడం మరీ కష్టం!

ఎందుకంటే జగ్గరాజు నాకు బాల్య మిత్రుడేగాదు, కల్సి చదువుకున్నాం! ఒకే డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాం గూడా.

పైగా జగ్గ రాజు ఆవేశపరుడు. ఏదన్నా విషయం మనసులో పడితే ఓ పట్టిన దాని అంతు చూడందే వదలడు.

జగ్గరాజు చాలా రోజులబట్టీ "రిటైర్ అవుతున్నావ్, ఇల్లు కట్టుకోకపోతే ఎలా?" అని నా వెంట బడ్డాడు. అంతేగాదు, మా ఆవిడకూ మారిపోశాడు.

దానాదీనా, ఇల్లు సంపాయించుకోవాలీ అని నిర్ధారణ కొచ్చాం!

కొన్నాళ్ళు పిల్లల చదువులు, ఆ పైన పెళ్ళిళ్ళు అని చెప్పి, ఇంటి జోలికి పోలేదు.

మగ పిల్లలు ఉద్యోగాల్లో చేరారు. ఆడపిల్లలు పెళ్ళిళ్ళయి అత్తారింట్లో కుదురుకున్నారు. కనుక ప్రస్తుతం బాదరబందీలేం లేవు.

కనుక ఇల్లు కొనడమో, కట్టించుకోవడమో చెయ్యాలి! అయితే ఎక్కడా? అన్న సమస్య ఎదురైతే,

జగ్గరాజు రంగంలోకి ధూకి, "మా ప్రశాంత నిలయం అద్భుతం! అంతా మనవాళ్ళే వున్నారు. నగరానికి కించిత్తు దూరం! బస్సు, రైలు వున్నాయి. చక్కటి ఇల్లు కట్టుకోవచ్చు!" అని చెప్పాడు. అంతేగాదు, "ఈ వూళ్ళో ఏముంది? గజం వేల మీద వుంది. ఉన్న డబ్బుకు స్థలం రాదు, ఇంక ఇల్లేం కడతావ్! పైగా సిమెంటు, ఇనుము, కూలీల రేట్లు మండిపోతున్నాయి. అదీగాక నీళ్ళేవీ?" అని గూడా చెప్పాడు.

మిగతా విషయాలెలా వున్నా, మా వూళ్ళో పేరుకు, నగరమే ఐనా నీళ్ళు దొరకవు. పెట్రోలు, కిరసనాయిలు, ఇలా ఏదన్నా డబ్బులకు కొనుక్కోవచ్చు గానీ నీళ్ళు దొరకవు.

బోర్‌లు వేయిస్తే వేల మీద ఖర్చు. రెండేళ్ళకోసారి బోర్ రిపేరు! తప్పవు.


మంచినీళ్ళు అపురూపమైన వస్తువు. మున్సిపాలిటీవారు దయతలచి వదిలితే అదీ రెండ్రోజులకోసారి, నాలుగు బిందెలొచ్చేసరికి గగనం. అక్కడా బాహాబాహీ ముష్టి యుద్ధాలకు దిగితేనే ఆ నీళ్ళయినా లభ్యమయ్యేది. ఆ వచ్చే నీళ్ళూ ఓ సమయానికి రావు. అర్థరాత్రి అపరాత్రీ అని లేకుండా వస్తుంటాయి. వాటి కోసం నిద్ర లేకుండా ఉండాలి!

"అందుకే మా ప్రశాంత నిలయం బెస్ట్! నీ కోసం ఓ మంచి ప్లాటు చూసి వుంచా! వచ్చెయ్యి!" అన్నాడు జగ్గరాజు.

మా ఆవిడ "పోయిరాండి! అన్నయ్యగారు అంతగా చెబుతున్నారుగా!" అని మొహమాట పెట్టింది.

ఓ ఆదివారం ఏడింటికే లేచి దిక్కుమాలిన పేసింజరు ఎక్కా! ఆ రైలు బండి పది మైళ్ళ దూరానికి మూడుసార్లు ఆగి, ముక్కి, మూలిగి, ఏడుస్తూ ఓ గంటకు తీసుకెళ్ళింది. రైలంతా చెత్తా, చెదారం. చొక్కాలు లేని ముష్టోళ్ళు, కుష్టోళ్ళు రైలు పెట్టంతా వాసన, మాగుడు వాసన. ఆ రైల్లో గంట కూర్చునేసరికి నాకు జీవితం మీద రోత పుట్టినంత పనైంది.

జగ్గరాజు స్టేషనుకు వచ్చాడు. ఆ స్టేషనంతా పొగచూరిపోయి, శిథిలావస్థలో వుంది. పైగా ముసురు పట్టడంతో స్టేషనంతా నిర్మానుష్యంగా వుంది. అక్కడో కుక్క, ఈ చివర ముడుచుకు కూర్చున్న సాధువు, నీలిరంగు దుస్తుల్లో పోర్టర్లు అంతే!




# జీవితం

తాలక రామారావు

భౌతికంగా ప్రశాంత నిలయం చూడకపోయినా జగ్గరాజు అడపాదడపా చెప్పే మాటలవల్ల దాని వివరాలన్నీ తెలుసు!

"ఎంత దూరం?"

"దగ్గరే! అయినా స్కూటర్ తెచ్చా! వానగదా! పైగా కొత్త కంకర రోడ్డు. నువ్వు నడవలేవులే!" అన్నాడు జగ్గరాజు.



స్టేషను బయటంతా పొలాలు! మెట్ట ప్రాంతం గనక పంటలు లేవు. అక్కడక్కడా తుమ్మ చెట్లు. తాటి చెట్లు ఉన్నాయి.

జగ్గరాజు "నడిస్తే ఎంత పది నిముషాల ప్రయాణం! ఎండాకాలం అయితే చల్లగాలికి నడుచుకుంటూ పోవచ్చు! వెన్నెల రోజుల్లో అయితే చుట్టూ పత్తి, పొగాకు, మిరప తోటలు! బలేగా వుంటుందిలే!" అని చెబుతూనే వున్నాడు.

స్టేషను నుండి ఓ అరమైలు కంకర రోడ్డు మీద వెళ్ళాక 'ప్రశాంత నిలయం' అని చూపే బోర్డు వుంది. అక్కడ నుంచి ఫర్లాంగు దూరంలో చెట్లు, చిన్న గుట్ట, దానిపై దేవాలయం. అదే ప్రశాంత నిలయం.

ఇళ్ళు అన్నీ ఒకటే నమూనాలో కట్టారు. కొత్త కాలనీ అవటంవల్ల ఇళ్ళ ముందు, పక్కనా చెట్లు బాగా పెరిగాయి. చక్కగా అమర్చిన బొమ్మల కొలువులా వుంది కాలనీ అంతా!

ఫుట్‌పాత్‌లపైన దుకాణాలు, మురుగు కాలవలు, వాహనాల పొగ, అరుపులు కేకలు లేకుండా ప్రశాంత నిలయం నిజంగానే ప్రశాంతంగా వుంది.

జగ్గరాజు ఇంట్లో గోడలకన్నీ దేవుడి పటాలున్నాయి.

ఆ మధ్యలోదే స్వామివారి ఫోటో.

## హైకూలు

ఒకటే చలి
వక్షస్థలపు రగ్గు
అనంత రాత్రి
*

గదిలో పంకా
లోలోన ఉక్క పోత
రాని ఉత్తరం.
*

దోష విగ్రహం
గుండె చోటులో కప్ప
పగల గొట్టు.
*

తెగిన హారం
చెదరిన ముత్యాలు
చేలో కొంగలు.
*

గొర్రెల మంద
లోయలో, తేనె రంగు
మచ్చ వక్షంపై
*

కొత్త కోరిక
బిగిసిన తలుపా
కిర్రు మనకే
*

తూనీగ గుంపు
తోటలోకి వచ్చింది
వర్షాన్ని మోస్తూ.
*

ఈదురు గాలి
సరుగుడు తోటలో
చిక్కిన శశి
*

నీటిలో చేప
గాలిలో లకుముకి
ఒకే ఆకలి.
*

అతడూ, ఆమె
వొత్తి నూనె, చివరి
కొకటే జ్వాల
*

నెల బాలుడు
విరిగిన వెన్నెల
పగటి శోకం.
*

కొక్కొ కొక్కొ కొ
గరిమే పిల్లల కోడి
ఆమె జ్ఞాపకం.
*

పూసిన పూలు
పటం చుట్టూ చేరాయి
పశ్చిమ యాత్ర.
*

ఎడారి దాహం
ఎండు ఖర్జూర పండు
విరహిమోవి.
*

చలి చీమలు
ఒళ్లంతా గిలిగింత
ప్రియుని స్పర్శ
*

ఆమె వెనకే
తోకను ఊపుకుంటూ
పిల్ల కాలువ.
*

కస్తూరి మృగం
కలయ తిరుగుతోంది
కాంక్షా పరిమళం.
(డా. సి. మృణాళినికి)

—శిఖామణి

స్వామీజీ నీలం రంగు వస్త్రాలలో, అభయముద్రలో, భక్తులను ఆశీర్వది స్తున్నారు.

ఇక్కడో విషయం చెప్పాలి. ప్రశాంత నిలయం ఏర్పడింది ఆ స్వామీజీ వల్లనే. అంతకు ముందు ఆ ప్రాంతంలో ఓ చిన్న గుడి మాత్రమే వుండేది గుట్టమీద. ఆ గుట్ట క్రింద చెరువు! అంతే.

స్వామీజీ ఎక్కడి వారో, ఎవ్వరికీ తెలియదు. వారొచ్చాక, ఆ ప్రాంతానికి ప్రాముఖ్యత ఏర్పడింది. ఆయనకో ఆశ్రమం, దాని చుట్టూతా జగ్గరాజు, తదితర అనుయాయులు ఏర్పరచుకున్న కాలనీ ఏర్పడింది.

"నువ్వు త్వరగా తయారైతే స్వామీజీని కలుద్దాం" అన్నాడు జగ్గరాజు.

"నేను రెడీ" అన్నా.

"స్వామీజీ దగ్గరకు వెళ్ళేప్పుడు శుచిగా వెళ్ళాలి! స్నానం చెయ్యి!"


"పొద్దున చేసే బయలుదేరా!"

"అయినా చేస్తే బాగుంటుంది!"

తప్పలేదు! మళ్ళీ స్నానం చేశా!

మేం వెళ్ళేసరికి స్వామీజీ ఆశ్రమంలో ఉన్నారు.

స్వామీజీ, బాలీసుల కానుకుని కూర్చున్నారు చిద్విలాసంగా. ఆయన ముందు కొంత మంది ఆడవాళ్ళు మగవాళ్ళు అంతా వయస్సు మళ్ళిన వాళ్ళే కూర్చోనున్నారు.




జగ్గరాజు వెడుతూనే సాష్టాంగ ప్రణామం చేశాడు. నేను 'విష్' చేశా అంతే.

స్వామీజీకి గిరజాల జుత్తు. గడ్డం మీసం, నీలంరంగు గుడ్డల్లో తమాషాగా వున్నారు.

జగ్గరాజు సవినయంగా నా గురించి స్వామీజీకి చెప్పారు.

ఆయన అంతా ఆలవోకగా విని, "ఆ ముష్ఠయ్యో ఫ్లాట్ ఆయనకు బాగుంటుంది. నే ముహూర్తం బెడతా! శంకుస్థాపన చేద్దాం!" అన్నారు.

స్వామీజీ మాటలకు జగ్గరాజు మహదానంద పడ్డాడు. తిరిగి వంగి వంగి నమస్కరించాడు.

"గొప్ప జాతకుడివోయ్! స్వామీజీ శంకుస్థాపన చేయడం గొప్ప అదృష్టమనుకో! మేం ఇంత మందిమి వున్నాం! ఇల్లు కట్టుకున్నామా! ఆయనింత వరకు మాకెవ్వరికీ ఈ అదృష్టాన్ని కలిగించలేదనుకో!" అని మురిసిపోయాడు.

జగ్గరాజు ఇంట్లో భోజనం చేశాక విశ్రమించా! జగ్గరాజు వెళ్ళాడు సాయంత్రం భజన కార్యక్రమం ఏర్పాట్లు చేసేందుకు.

సాయంత్రం భజనకు లాక్కుపోయాడు జగ్గరాజు. దాదావు కాలనీవాసులంతా భజనకు హాజరయ్యారు.

ఆక్కడున్న జనంలో అంతా వయో పరిపాకం తప్పినవాళ్ళే. కుర్రాళ్ళు, యువకులు, పిల్లలు ఎవ్వరూ కనబడలా నాకు! కొందరు రోగ గ్రస్తులు, మరి కొందరు జీవిత చరమాంకంలో వున్నవాళ్ళు.

భజన ఓ గంట సేపు జరిగింది. ఆ తర్వాత ప్రసాదాలు పంచారు. స్వామివారు జీవిత పరమార్థం గురించి, నియమ బద్ధ జీవితం గురించి ఉపన్యసించారు.

ఆయన ఉపన్యాసం నాకు నచ్చలేదు. ఆయన చెబుతున్న విషయాలన్నీ ఎవ్వడో, ఎక్కడో విన్నవిలాగానే తోచాయి.

ఆ తర్వాత స్థలం చూశా! బాగానే వుంది. గుట్టమీద గుడికి వెళ్ళా! అది గుడి అనటం కంటె, చిన్న మందిరం అనొచ్చు. ఓ రాతికి సింధూరం పూసినది–ఆంజనేయస్వామి, అనంటూరు.

ఆ గుళ్ళోనే కాలనీ వాసులు కొందరు కలిశారు. వారి మాటల్లో తేలిం దేమిటంటే అక్కడ ప్రశాంతంగా జీవించటంలో ఆనందం వుంది. సౌఖ్యం వుంది. కనుక నన్నూ త్వరగా వచ్చి ఇల్లు కట్టుకొని చేరి పొమ్మని సలహా ఇచ్చారు.

చీకటి పడేవేళకు తిరుగు ప్రయాణం అయ్యాం. జగ్గరాజు మళ్ళీ బండి మీద తీసుకొచ్చాడు స్టేషనుకు.

"ఎలా వుంది? కాలనీ?" అనడిగాడు జగ్గరాజు.

"బాగానే వుంది" అన్నా!

సెలవల్లో లేదా ఇంటి దగ్గరే వుంటే కాలనీవాసులకు, కాలం ఎలా గడుస్తుందీ? తిరగటానికి ఊరు లేదు, సినిమా హాళ్ళు లేవు..సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు హర్తాళ్ళూ ఏమీ వుండవు ఆ కాలనీలో. ఈ సందేహానికి జగ్గరాజే మాటల్లో సమాధానం చెప్పాడు.

ఐదింటికి నగర సంకీర్తన! ఏడింటికి స్వామివారి దగ్గర పూజ, మధ్యాహ్నం, కాలనీ స్త్రీలు సమావేశమై మహిళామండలి సమావేశం. సాయంత్రం భజన! స్వామివారి ఉపన్యాసం మాఘమాసం, కార్తీకమాసంలో సమారాధనలు! సుబ్బారాయుడి షష్టి, నాగుల చవితి అట్లతద్ది–అబ్బో రోజూ కార్యక్రమం, పూజలు, క్షణం తీరికుండదు. ఇదో ప్రపంచం!

తిరిగొచ్చాక జగ్గరాజు రోజూ నా ప్రాణం తీసేవాడు. ఇల్లు కట్టూ అని, నిర్ణయం చెప్పమని.

'వద్దు' అని చెప్పాలని నా అభిప్రాయం. కానీ జగ్గరాజుకు ఆ మాట చాలా రోజులు చెప్పలేక పోయాను.

జగ్గరాజు వదల్లేదు. ఆఖరికి ఏం చేశాడో తెలియదుగానీ మా ఆవిడ నన్ను నిలదీసింది.

"ఊరు బాగుంది! అంతా తెలిసిన వాళ్ళున్నచోట ఇల్లు కట్టుకుంటే సుఖంగదా! ఇంతకూ మీ మనసులోని మాట చెప్పండీ" అంది.

తప్పలేదు చెప్పాను.

అక్కడ అంతా రిటైరయిన వాళ్ళే వున్నారు. ఉన్నవాళ్ళల్లో ఎంతో మంది జబ్బు మనుషులు. వాళ్ళకు జీవితం మీద ఆశ లేదు. బ్రతకాలన్న ఇచ్ఛలేదు. ఉన్నవాళ్ళు మరణానికి ఎదురుచూస్తూ వున్నట్టు తోచారు.

నాకు జీవితం మీద ఆశ వుంది. ఆ కాలనీలో వుంటే అక్కడ జీవం లేదు. బయట ప్రపంచంతో సంబంధం వుండదు. అందుకని వద్దంటున్నాను.

కష్టాలు, కన్నీళ్ళు, ఈతి బాధలు, ఆందోళనలు, కర్ఫ్యూలు, రోగాలు, బంద్‌లు ఇవన్నీ కావాలి నాకు. చైతన్యం కావాలి! స్తబ్ధుగా బ్రతకలేను బావిలో కప్పలాగా.

మా ఆవిడకు ఎంతమాత్రం నా భావన అర్థమైందో తెలియదు. నన్ను విచిత్రంగా చూసింది. జగ్గరాజు నాతో మాట్లాడటం మానేశాడు.